క్లుప్తంగా

22న కంటి వైద్య శిబిరం

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 22న కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చెంగారెడ్డి గురువారం తెలిపారు. శంకర్ నేత్రాలయ సౌజన్యంతో ప్రతి నెలా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడు తున్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కలు నాటారు



మొక్కలు నాటి నీరు పోస్తున్న పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు

గంగవరం: మొక్కలు నాటి సంరక్షిస్తే అవే పెద్ద వృక్షాలై భావి తరాలను కాపాడుతాయని పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు అన్నారు. మండలంలోని జీఎల్ఎస్‌ఫాం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. సభ్యులు మాట్లాడుతూ, వర్షాకాలం దృష్ట్యా విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. మానవాళి మనుగడ పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని అందరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. పలమనేరు ఫారెస్ట్ రేంజర్ శివన్న, పలమనేరు పరిరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు ఆనందబాబు, సంస్థ అధ్యక్షుడు సుబ్రమణ్యంపిళ్లై, కార్యదర్శి నరసింహులు సేవారత్న శ్రీపురం సీతారామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెంగప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ లింగప్ప

వి.కోట: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ లింగప్ప హెచ్చరించారు. గురువారం పట్టణంలో ఆయన వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇద్దరు మాత్రమే ప్రయాణించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా కారు డ్రైవ్‌చేయడం నేరమన్నారు. అలాగే వాహనదారులు తమ వాహనాలకు సంబంధించి డాక్యుమెంట్స్ మొత్తం వాహనంలోనే ఉంచుకోవాలన్నారు. అలా లేనిపక్షంలో అధిక జరిమానా, జైలు శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. వివిధ వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



గొబ్బిళ్లకోటూరు పాఠశాలలో పిల్లల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు: మున్సిపాలిటీలోని ఉర్దూ స్కూల్, గొబ్బిళ్లకోటూరు ప్రైమరీ పాఠశాలలను స్థానిక ఎంఈఓ లీలారాణి గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అకడమిక్‌కు సంబంధించిన అన్ని రికార్డులను అప్‌డేట్‌గా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో అన్ని సౌకర్యాలున్నాయని, విద్యార్థులు అన్నింటా రాణించేలా వారిలో సామర్థ్యాలను పెంపొందించేందుకు టీచర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

కేన్సర్ నిర్ధారణ పరీక్షలపై శిక్షణ



శిక్షణ పొందిన ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం కాంప్రెన్సివ్ కేన్సర్ కేర్ రెండవ విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి ప్రవీణ మాట్లాడుతూ, 30 ఏళ్లు పైబడిన వారికి వివిధ రకాల సర్వైకల్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, ఓరల్ కేన్సర్‌పై స్క్రీనింగ్ ఏ విధంగా చేయాలో వివరించారు. కార్యక్రమంలో మెడికలాఫీసర్ కుమార్‌రాజా, వైద్యాధికారులు వెంకటేశ్వరరావు, శారద, పూర్ణలత, రాజేశ్వరి, మండలంలోని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

విషజ్వరాల విజృంభణ



టి.వడ్డూరులో వైద్య శిబిరం



టి.వడ్డూరులో నిల్వనీటిని పారబోస్తున్న ఏఎన్ఎంలు

- టి.వడ్డూరులో 12 కలరా కేసులు
- నియోజకవర్గంలో ఐదు డెంగీ కేసులు
- పదుల సంఖ్యలో టైఫాయిడ్ బాధితులు

పలమనేరు: వర్షాల కారణంగా పలమనేరు నియోజకవర్గంలోని గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం, కలుషిత తాగునీరు, మారిన వాతావరణం మార్పుల కారణంగా కొన్నిరోజుల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. విష జ్వరాల కేసులు వెలుగుచూసిన గ్రామాల్లో వైద్యులు తమ సిబ్బందితో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నా పూర్తిగా తగ్గుతున్న పరిస్థితులు లేవని తెలుస్తోంది. దీనికి తోడు జ్వరంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే అది ఏ జ్వరమో టెస్ట్‌లు చేయకుండా చికిత్స చేస్తూ, తగ్గకుంటే మూడు నాలుగుసార్లు తిప్పించుకున్నా అప్పటికీ తగ్గకపోతే తీరా ఏదైనా పెద్దాసుపత్రికి వెళ్లాలంటూ రెఫర్ చేస్తున్నారు. దీంతో ఉన్న కాస్త రోగం మరింత ముదిరి పరిస్థితి విషమించే స్థాయికి చేరుతోంది.

టి.వడ్డూరులో కలరా

మండలంలోని టి.వడ్డూరులో 12మందికి కలరా సోకినట్టు వైద్యశాఖ నిర్ధారించింది. ఆ మేరకు గ్రామానికి చెందిన రోగుల రక్త నమూనాలు సేకరించి తిరుపతిలోని మైక్రోబయాలజీ ల్యాబ్‌కు పంపగా నిర్ధారణ పరీక్షల్లో అన్నీనూ పాజిటివ్ వచ్చినట్టు తెలిసింది. ఇక బైరెడ్డిపల్లె మండలం కొత్తిండ్లులోనూ ఓ వ్యక్తికి కలరా సోకినట్టు తెలియవచ్చింది. టి.వడ్డూరులో మాత్రం ఇక్కడి వైద్యాధికారులు ప్రత్యేకవైద్య శిబిరం చేసి రోగులకు సేవలు అందిస్తున్నారు. గ్రామంలో నిల్వ ఉన్న నీటిని వైద్య సిబ్బంది పారబోయించి గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మరోవైపు అధికారులు మురుగు కాలువలను శుభ్రం చేయించి తాగునీటిని సైతం ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. వ్యాధి పీడిత అనుమానితుల సంఖ్య పెరుగుతుండడంతో ఇక్కడ క్యాంపు కొనసాగుతుందని మండల వైద్యాధికారి మల్లికార్జున రెడ్డి తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తీసుకోవాలని సూచించారు.

డెంగీ సైతం..!

ఇక డెంగీ జ్వరాలు సైతం పలమనేరు, వీ.కోట లాంటిచోట్ల ప్రైవేటు ఆస్పత్రుల్లో బయటపడుతున్నాయి. డెంగీ నిర్ధారణకు నియోజకవర్గంలో ఖచ్చితమైన ఫలితాలను తెలిపే ల్యాబ్‌లు లేవు. దీంతో రోగులకు ఇబ్బంది తప్పడం లేదు. సచివాలయాల ఆరోగ్య సిబ్బందికి ఐదేసి కిట్లను ఇచ్చినా వీటిలోనూ పెద్దగా ఫలితం లేదు. తిరుపతిలో ఎలీసా టెస్ట్ చేసుకుంటే తప్పితే డెంగీని గుర్తించడం కష్టంగా మారింది. ఫలితంగా రోగం ముదిరాక రోగులు పెద్దాసుపత్రులకు పరుగులు తీయాల్సి వస్తోంది. నియోజవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ఐదుగురు కుప్పం పీఈఎస్, బెంగళూరు సెయింట్ జాన్స్, వేలూరు సీఎంసీలలో చికిత్స పొందుతున్నట్టు తెలిసింది.

టైఫాయిడ్ జోరు

మరోవైపు గ్రామాల్లో టైఫాయిడ్ కేసులు సంఖ్య కూడా పెరుగుతోంది. పలమనేరులోని వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ రోగులుగా 40మంది వరకూ టైఫాయిడ్‌తో చికిత్స పొందినట్టు తెలిసిందే.ఇప్పటికైనా సంబంధిత మండలాల అధికారులు, పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నష్టపరిహారం చెల్లిస్తాం



బైరెడ్డిపల్లె ఎక్స్‌ప్రెస్ హైవేలో భూములు కోల్పోతున్న బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మనోజ్‌రెడ్డి

- ఎక్స్‌ప్రెస్ హైవే పనులకు సహకరించండి
- ఆర్బిటేషన్ వేసుకుంటే బాధితులకు న్యాయం
- ఆర్డీఓ మనోజ్‌రెడ్డి హామీ

బైరెడ్డిపల్లె: బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భూములు, ఇంటి స్థలాలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లిస్తామని, రహదారి పనులకు సహకరించాలని ఆర్డీఓ మనోజ్‌రెడ్డి కోరారు. బైరెడ్డిపల్లెలో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులతో గురువారం సమావేశం నిర్వహించారు. పలువురు బాధితులు తమ గోడు ఆర్డీఓకు నివేదించారు. 2017లో జాయింట్ కలెక్టర్ నారాయణ భరత్‌గుప్తా రైతులతో సమావేశం ఏర్పాటు చేసి బైరెడ్డిపల్లె–వీ.కోట జాతీయ రహదారిలో ఇంటి స్థలాలు కోల్పోతున్న బాధితులకు చదరపు అడుగు 1,673 రూపాయలుగా నిర్ణయించారన్నారు. అయితే ఆయన బదిలీపై వెళ్లడం, మరో జాయింట్ కలెక్టర్‌గా గిరీషా బాధ్యతలు స్వీకరించిన తరువాత బాధితులకు ఎలాంటి సమాచారం ఇవ్వక చదరపు అడుగు కేవలం రూ.140గా నిర్ణయించి పరిహారం తీసుకోవాలని రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. అప్పటినుంచి పరిహార విషయంలో కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేసినా స్పందించిన పాపానపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది బాధితులు చేసేదేమీ లేక ఇచ్చిన పరిహారం తీసుకున్నారని, మరి కొందరు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారన్నారు. అంతేకాకుండా పరిహారం నిర్ణయించేంత వరకు పనులు జరగడానికి వీలు లేదని అడ్డుకున్నట్లు చెప్పారు. కూలి చేస్తే గానీ జీవనం సాగించలేని కుటుంబాలు చాలా ఉన్నాయని, పేదలను దృష్టిలో ఉంచుకుని న్యాయబద్ధంగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దీనిపై ఆర్డీఓ ప్రతిస్పందిస్తూ, బైరెడ్డిపల్లెకు కూతవేటు దూరంలో ఉన్నందున నష్టపరిహారం చెల్లించే విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. పరిహారం చాలా తక్కువ ఉన్న విషయం అర్థమవుతోందని, బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పరిహారం పొందిన తరువాత ఆర్బిటేషన్ వేసుకుంటే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. రహదారి నిర్మాణ పనులకు సహకరించాలని మరోసారి కోరారు. కార్యక్రమంలో ఎక్స్‌ప్రెస్ హైవే పీడీ కార్తీక్ రెడ్డి, తహసీల్దార్ స్వర్ణలత, మండల సర్వేయర్ సాయిరాజ్ నాయక్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

డ్రాపౌట్లను గుర్తించిన అధికారులు

- కస్తూర్బా గురుకుల పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు



బడి మానేసిన విద్యార్థులతో ఎంఈఓ శ్రీనివాసులు

రొంపిచెర్ల: మండలంలోని మోటుమల్లెల గ్రామ పంచాయతీలో ఏడుగురు బడి ఈడు పిల్లలను గుర్తించినట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గురువారం బాలనాగిరెడ్డిగారిపల్లె పాఠశాలకు సమీపంలోని మామిడి తోటలలో పనిచేస్తున్న కుటుంబాల్లో ఏడుగురు డ్రాపౌట్లు ఉన్నట్టు గుర్తించినట్టు చెప్పారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి వారిని బడిలో చేర్పిందుకు అంగీకరించారని తెలిపారు. రొంపిచెర్ల కస్తూర్బా గురుకుల పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

తిరుమలకు భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా తిరుమలకు బయలుదేరిన భక్తులు

గంగవరం: మండలంలోని చౌడిరెడ్డిపల్లె పంచాయతీ బత్తనపల్లె, చౌడిరెడ్డిపల్లె, మిట్టమీదకురప్పల్లె గ్రామాల నుంచి దాదాపు వంద మందికిపైగా తిరుమలకు పాదయాత్రగా గురువారం బయలుదేరి వెళ్లారు. ప్రతి ఏటా బాగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని మొక్కుబడితో తామంతా తిరుమల శ్రీవారి దర్శనార్థం వెళ్తున్నట్టు చెప్పారు. గోవింద నామస్మరణ, పండరీ భజనల నడుమ భక్తుల పాదయాత్ర కోలాహలంగా సాగింది. ఆదివారం తిరుమలకు చేరుకుని అక్కడ స్వామివారిని దర్శించుకుంటామన్నారు.

ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- సమయ పాలన తప్పనిసరి
- జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

కార్వేటినగరం: విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు అన్నారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో డీఈఓ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రతిఒక్కరూ విధి నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. అలాగే ప్రభుత్వం నిర్వహిస్తున్న నేను బడికి పోతా కార్యక్రమాన్ని వందశాతం విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. పాఠశాల ఆవాస ప్రాంతాల్లోని బడి ఈడు పిల్లలను విధిగా గుర్తించి 6–16 ఏళ్లలోపు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బలోపేతం చేయాలన్నారు. అదేవిధంగా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలను మెరుగు పరిచి వారి అభ్యున్నతికి దోహదం పడాలని ఆదేశించారు. డ్రాపౌట్లు లేకుండా ప్రతిఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో ఉండే విధంగా చూడాలన్నారు. అలాగే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఇప్పటి నుంచే నాణ్యమైన బోధన అందించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారులు విజయకుమార్, మనోజ్‌కుమార్‌తో కలసి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుల వివరాలతోపాటు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

సదుం: వంద లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ షేక్‌షావలి చెప్పారు. మండలంలోని చీకలచేను సమీపంలోని తాతయ్యగుంట వద్ద సారా తయారు చేస్తున్నట్టు సమాచారం అందడంతో గురువారం సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. అక్కడ వంద ప్యాకెట్ల సారా లభించిందని, చీకలచేనుకు చెందిన సారా తయారీదారులు హరి, వెంకటరమణ తమను చూసి పారిపోయారని ఆయన చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మండలంలో ఎక్కడైనా సారా తయారు చేస్తున్నట్టు సమాచారం తెలిస్తే తమ దృష్టికి తేవాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ చెప్పారు.

పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

తవణంపల్లె: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆయన గురువారం ఆయన తన కార్యాలయంలో సమీక్షించారు. ఎన్నికల అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది గ్రామాలను సందర్శించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, పైపులైన్లు లీకేజీ, డ్రైనేజీ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. వర్షాకాలంలో నీళ్ల ట్యాంకులకు క్లోరినేషన్ చేయించాలని, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని చెప్పారు. గ్రామాల్లో రాత్రుల్లో వీధిలైట్లు వెలుగుతున్నాయా, లేదా? లైట్లు వెలగకుంటే ప్రజల సౌకర్యార్థం వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. సచివాలయాల్లో ప్రభుత్వ సేవలను కొనసాగించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



గుడుపల్లె: విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న ఎంఈఓ లక్ష్మయ్య



పెద్దపంజాణి: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గుడుపల్లె: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని అధికారులు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్ క్రాస్ నుంచి గుడుపల్లె వరకు ఈ ర్యాలీ చేశారు.6 నుంచి14 ఏళ్ల లోపు ఉన్న పిల్లలతో పనులు చేయించినా, దుకాణాలలో పనులకు వినియోగించినా వారిపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ లక్ష్మయ్య హెచ్చరించారు. చదవాల్సిన వయస్సులో వారిని పాఠశాలకు విధిగా పంపాలని పనులకు కాదని హితవు పలికారు. పిల్లలకు కావాల్సిన సౌకర్యాలు, వసతులు ప్రభుత్వ స్కూళ్లలో పుష్కలంగా ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అలాగే గ్రామాలలో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

పెద్దపంజాణి: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ గోపాల్‌రెడ్డి కోరారు.. గురువారం వివిధ శాఖల అధికారులు, పెద్దపంజాణి ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి మండల కేంద్రంలో ×నేను బడికి పోతా× అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ పాఠశాలలకు మిన్నగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. జూలై 12వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాగే తొలిసమ్మగుడి పాఠశాలలో హెచ్ఎం హరిప్రసాద్ అధ్వర్యంలో ఇదే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేంద్ర, హెచ్ఎం కేశవపిళ్లై, ఈఓపీఆర్ఆర్డీ శారదాదేవి, పలువురు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదుల పుస్తకం పెట్టండి

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారులు సమస్యలు తెలపడానికి వీలుగా సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదుల పుస్తకం పెట్టాలని ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఈఈ మునిచంద్ర ఆదేశించారు. గురువారం ఆయన రెడ్డిగుంట సెక్షన్ కార్యాలయం, సబ్‌స్టేషన్‌ను పరిశీలించి మాట్లాడారు. సబ్‌స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏఈ విశ్వప్రసాద్‌ను ఆదేశించారు. ప్రాంగణం పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉంచుకోరాదన్నారు. తరచూ శుభ్రం చేయాలని చెప్పారు. పెండింగ్‌లోని వర్క్‌ఆర్డర్లను పూర్తి చేయాలన్నారు. సబ్‌స్టేషన్‌లో వస్తున్న ఫిర్యాదులను పర్యవేక్షించడానికి డీఈని నియమించినట్లు తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు వారు పరిశీలిస్తుంటారని చెప్పారు. వర్షం వచ్చినప్పుడు సమస్యలు ఉత్పన్నమైతే క్షేత్రస్థాయి సిబ్బంది పరిష్కరించాలన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ మునిచంద్ర

రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం



పుంగనూరులో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సన్మానిస్తున్న తహసీల్దార్ శివయ్య తదితరులు



పెద్దపంజాణి: తహసీల్దార్, డీటీని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పుంగనూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత తహసీల్దార్ రెడ్డెప్పరాజు, వాలీశ్వరశర్మ తదితరులను తహసీల్దార్ శివయ్య సన్మానించి మాట్లాడారు. ప్రజలకు సేవలు అందించడంలో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైనదని, ప్రజలకు ఎంతగానో సేవలందించిన రెవెన్యూ ఉద్యోగులను సన్మానించుకోవడం తమ కర్తవ్యమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్వేయర్ ప్రకాష్‌రెడ్డి, వీఆర్‌వోలు రాజు, సుబ్బారెడ్డి, బద్రీనాథ్, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో రెవెన్యూ శాఖ కీలకం

పెద్దపంజాణి: ప్రజాసేవలో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని తహసీల్దార్ నాగేంద్ర పేర్కొన్నారు. గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని తన కార్యాలయంలో తహసీల్దార్ ఘనంగా నిర్వహించారు. కార్యాలయానికి వచ్చిన వారికి రెవెన్యూ రికార్డులపై అవగాహన కల్పించారు. ప్రజలకు కావాల్సిన అన్ని ధ్రువపత్రాలను, హక్కులను కలుగజేసేది రెవెన్యూ శాఖ అని, అన్ని శాఖలకు మాతృశాఖగా తమ శాఖకు గుర్తింపు ఉండడం గర్వకారణమని తహసీల్దార్ చెప్పారు. అనంతరం తహసీల్దార్, డీటీ ఫణికుమార్‌ను వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

శేషుడిపై శ్రీమన్నారాయణుడి విహారం



శేష వాహనంపై విహరిస్తున్న శ్రీమన్నారాయణుడు



ఉయ్యాలసేవ నిర్వహిస్తున్న ఉభయదారులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీ కోదండరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీమన్నారాయణుడు గురువారం రాత్రి శేష వాహనం భక్తులకు అభయమిచ్చారు. ఆలయంలో వేదపండితులు ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయ స్వామికి అభిషేకం చేశారు. సుగంధపరిమళ పుష్పాలు, శేషవస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామికి పూజలు చేసి ధూప దీప నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉభయదారులు శివశంకర్‌రెడ్డి కుటుంబసభ్యులతో తిరుమంజనం, ఉభయదారులు శరవణభవ రెడ్డి కుటుంబసభ్యులు పాలాభిషేకం చేయించారు. సాయంకాలం ఉభయదారులు కరుణాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు ఊంజల్ సేవను నిర్వహించారు.

శేషవాహనంపై ఊరేగుతూ..

సాయంత్రం ఉభయదారులు సాంబశివారెడ్డి కుటుంబసభ్యులు స్వామికి పూజాసామగ్రి, సుగంధపుష్పాలు, ప్రసాదాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు, అర్చలు చేయించి నైవేద్యం సమర్పించారు. విద్యుద్దీపాలు, సుగంధపుష్పాలతో అందంగా రూపుదిద్దుకున్న శేష వాహనంపై శ్రీమన్నారాయణుడు కొలువుదీరారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ పురవీధుల్లో విహరిస్తూ భక్తులు కటాక్షించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళ హారతులిచ్చారు.

సీతారాముల కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం సీతారాముల కల్యాణోత్సవం, కల్యాణతిరుక్కోణం, ఉయ్యాలసేవను వైభవంగా నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి. సిద్ధేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు. రాత్రి గరుడ వాహన సేవ ఉంటుందని వివరించారు.